అధ్వానంగా.. దారులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని యర్రగుడిపల్లెలో రోడ్లు అన్ని చాలా అధ్వానంగా ఉన్నాయి. భూగర్భ డ్రైనేజీ పనుల కోసం గత ఏడాది రోడ్లు తవ్వి అలాగే వదిలేశారు. ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడ పనులు అక్కడ ఆగిపోయాయి. దీంతో యర్రగుడిపల్లెలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు గులకరాళ్లతోపాటు మురుగు నీటితో దర్శనం ఇస్తున్నాయి. రాత్రి సమయాల్లో రోడ్లపై నడవాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యర్రగుడిపల్లెలో రోడ్లు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్లను బాగుచేయండి



యర్రగుడిపల్లెలో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగుచేయాలి. గెరండాల్ బ్రిడ్జ్ వద్ద రోడ్లు గుంతలు ఏర్పడ్డాయి. వానాకాలంలో వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉంది. అనేక మార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్లను బాగుచేయండి.

– శంకర్, స్థానికుడు, పులివెందుల

కంకర రోడ్డుతో అవస్థలు పడుతున్నాం



ఎర్రగుడిపల్లెలో డ్రైనేజీకోసం రోడ్లను తవ్వి ఏడాది పూర్తవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. రోడ్లపై కంకర తేలి ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– రవి, స్థానికుడు, పులివెందుల



యర్రగుడిపల్లెలో అధ్వానంగా ఉన్న రోడ్డు



రోడ్లపైన ఉన్న మురుగు నీరు

జూలై 1 నుంచి యోగా శిక్షణ

కడప ఎడ్యుకేషన్: కడప పటేల్ రోడ్డులోని మిత్ర యోగా కేంద్రంలో జూలై ఒకటో తేదీ నుంచి కొత్త బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ ఆర్.రంగనాథ్‌రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ శిక్షణతో రోగ నిరోధకశక్తి పెరుగుతుందని, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బీపీ, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు అవసరమైన యోగాసనాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు. ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని చెప్పారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకుంటాం

బ్రహ్మంగారిమఠం: విద్యుత్తు వినియోగదారుల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని అడ్డుకుంటామని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ తెలిపారు. ఆదివారం బి.మఠంలో పలు గృహాలకు అమర్చిన స్మార్ట్ మీటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలపై విద్యుత్ చార్జీల భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు.

క్లుప్తంగా

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లికి ఆదివారం విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు పట్టారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు.

నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రాక



ఎంపీ ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న పీర్ల చావిడి

వేముల : మండలంలోని పెద్దజూటూరు గ్రామానికి సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్నారు. గ్రామంలో రూ.19.50లక్షలతో నూతనంగా నిర్మించిన పీర్ల చావిడిని ఎంపీ ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. ఎంపీ పర్యటనలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముగిసిన భాగవత పఠనం



ఆలయం చుట్టూ కలశ ప్రదర్శ చేస్తున్న సభ్యులు

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరులో వీరబ్రహ్మం ఆలయంలో ఆదివారం భాగవత పఠనం ముగిసినట్లు గ్రామస్తులు తెలిపారు. భాగవత సభ్యులకు వారం రోజులపాటు వసతి సౌకర్యాలు కల్పించారు. నార్పల తిక్కయ్యస్వామి భాగవత భక్త సమాజ సభ్యులు ఆలయం చుట్టు భక్తుల కలశ ప్రదర్శనం నిర్వహించారు. వక్తలతో ప్రవచనం తదనంతరం భాగవత పండితులను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉదయభాస్కర్

చింతకొమ్మదిన్నె: కడప నగరంలోని పలువురు విద్యార్థులకు స్థానిక ప్రముఖులు ఉదయభాస్కర్ ఆదివారం పుస్తకాలను పంపిణీ చేశారు. గోపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సహాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయ భాస్కర్ మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివితే సాధించలేనిదేదీ లేదని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. బాగా చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని ఆయన సూచించారు.

ఘనంగా ఎరువాక గంగమ్మ వార్షికోత్సవం



ఏరువాక గంగమ్మ

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని శాంతినగర్ కాలనీలో ఏరువాక గంగమ్మతల్లి 28వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆషాడ శుద్ధ చవితి సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, కలశస్థాపన, పంచామృత అభిషేకం, వంటి కార్యక్రమాలకు వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. చెక్కభజన, కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

చదువుకు పేదరికం అడ్డుకారాదు

కడప ఎడ్యుకేషన్: ప్రతిభావంతులైన పేద విద్యార్థుల విద్యకు పేదరికం అడ్డుకారాదని అమన్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. కడప నగరానికి చెందిన బి ఫార్మసీ విద్యార్థి స్వర్ణకు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రూ.17500 ఆర్థికసాయం జమాతే ఇస్లామిహింద్ రాష్ట్ర నాయకులు ఇందాదుల్లా హుసేని సాహెబ్ చేతుల మీదుగా అందజేశారు. ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువే చక్కని బాట అని, ఎన్నో సంవత్సరాలుగా విద్యాభివృద్ధికి ట్రస్టు కృషి చేస్తోందని పేర్కొన్నారు. చదువులో రాణించి ట్రస్టు సేవలలో భాగస్వామ్యం అవుతానని స్వర్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫారూఖ్, డాక్టర్ ఏజస్, అన్వర్‌బాషా, జిలాన్, ఇలియాస్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో తనిఖీ

సిద్దవటం : భాకరాపేట, సిద్దవటం ప్రధాన రహదారి, కడప ఫారెస్టు రేంజి పరిధిలోని పోలీసు బెటాలియన్ సమీపంలో, కనుమలోపల్లె ఫారెస్టు బీటు వద్ద, తదితర అనుమానిత ప్రదేశాల్లో ఆదివారం సిద్దవటం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఒంటిమిట్ట సీఐ బాబు ఆదేశాలతో మండల ఎస్ఐ మహమ్మద్ రఫీ సూచనల మేరకు పోలీసులు ఓపెన్ డ్రింక్, జూదం అరికట్టేందుకు ఈ తనిఖీలు నిర్వహించారు.

తల్లులే మొదటి గురువులు



మాట్లాడుతున్న ముఫ్తీ అహ్మదుల్లా నిసార్

కమలాపురం : ప్రతి ఇంట్లో తల్లులే మొదటి గురువులని, దైవ దూత మహమ్మద్ ప్రవక్త మార్గం ప్రతి ఒక్కరికి అనుసరనీయం అని ముఫ్తీ అహ్మదుల్లా నిసార్ సాబ్, మరో ముఫ్తీ అబ్దుల్ హాది తెలిపారు. ఆదివారం స్థానిక కుమ్మర వీధిలోని మద్రసా-ఏ-షహమీరియా తాలిముల్ ఖురాన్ నాల్గవ వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజం యువతపై ఆధారపడి ఉందన్నారు. గౌరవప్రదమైన సమాజం నిర్మించాలంటే యువతకే సాధ్యమన్నారు. అయితే తల్లిదండ్రుల బాధ్యత వీటిపై ప్రత్యేకించి ఉండాలన్నారు. ముఖ్యంగా పిల్లలకు మొదటి గురువులు తమ తల్లులే అన్నారు. తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రవక్త సూచించిన మంచి మార్గంలో యువత పయనించేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఉన్నతమైన జీవితం పొందేలా చిన్నారులకు చిన్నతనం నుంచే తర్ఫీదు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరు ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలన్నారు. పెద్దలను గౌరవించడం కూడా తల్లిదండ్రులే నేర్పాలన్నారు. గత ఏడాది 8 మంది, ఈ ఏడాది 10 మంది విద్యార్థులు ఖురాన్ షరీఫ్‌ను కంఠస్తం చేయడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షహమీరియా సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ జాహిద్ హుసేన్, స్థానిక మస్జిద్‌ల ఇమాంలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ



కుళాయిస్వామి దర్గాలో ప్రతిష్ఠించిన పీర్లు (ఫైల్)

కమలాపురం : మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇప్పటికే పట్టణంలోని కుళాయిస్వామి దర్గా, బీడీ కాలనీ, అప్పాయపల్లెతో పాటు మండల పరిధిలోని పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, విభరాపురం, కోగటం, పందిళ్లపల్లె తదితర గ్రామాల్లో పీర్ల చావిడీలు ముస్తాబయ్యాయి. శనివారం నుంచి భక్తి శ్రద్ధలతో పీర్లు ప్రతిష్ఠించనున్నారు. ముస్లిలు జరుపుకునే పండుగల్లో రంజాన్, బక్రీద్ తర్వాత అత్యంత పవిత్రమైన పండుగ ఇది. మత సామరస్యానికి, సమైక్యతా సద్భావనకు ఈ పండుగ నిదర్శనంగా నిలుస్తోంది. దక్షిణ భారత దేశంలో అన్ని మతాల వారు కలసి మెలసి జరుపుకునే పండుగల్లో మొహర్రం పండుగ ఒకటిగా ప్రజలు భావిస్తారు. ముస్లింలతో పాటు హిందువులు కూడా ఈ పండుగను చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇస్లాం క్యాలెండర్ (హిజ్రి) ప్రకారం మొహర్రం నెల మొదటిది. పట్టణంలో వెలసిన శ్రీ కుళాయిస్వామి దర్గాలో శనివారం భక్తి శ్రద్ధలతో పీర్లు ప్రతిష్ఠించనున్నారు. 1958 మే 18వ తేదీ నుంచి అహోరాత్ర దీపారాధన జరగడం ఈ దర్గా ప్రత్యేకత. 60 ఏళ్లకు పైబడి నుంచి నిరాటంకంగా దీపారాధనకు సహకరిస్తున్న భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా జూలై 6వ తేదీ రాత్రి పీర్ల మెరవని జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. జూలై 7వ తేదీ తెల్లవారు జామున పీర్లు ఎత్తుకుని అగ్ని గుండ ప్రవేశం జరుగుతుందని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

సమాజ సేవ చేయకపోతే జీవితం వ్యర్థం



సభ్యులను సన్మానిస్తున్న మానవతా సేవా సంస్థ సభ్యులు

పులివెందుల రూరల్ : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు సమాజ సేవ చేయక పోతే జీవితం వ్యర్థం అవుతుందని మాజీ మండల విద్యాశాఖాధికారి సదాశివారెడ్డి తెలిపారు. ఆదివారం మానవత సంస్థ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే 10వ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. చిన్న వయస్సు నుంచి సామాజిక సేవా దృక్పదం అలవరుచుకోవాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు జయరాజు, గంగిరెడ్డి, పోరెడ్డి ప్రభాకరరెడ్డి, జిల్లా కౌన్సిల్ రీజియన్ సభ్యులు, చెవ్వా కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బండి హరిశ్చంద్రారెడ్డి, శివరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శేషయ్య, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గణాంకాలు ఎంతో కీలకం

కడప ఎడ్యుకేషన్: ప్రతి మనిషికి నిత్య జీవితంలో గణాంక శాస్త్రంతో అనుబంధం ఉంటుందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. జాతీయ గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప పురుషుల కళాశాలలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ దేశాభివృద్ధి, సమాజాభివృద్ధి, కుటుంబ, వ్యక్తిగత అభివృద్ధిలో గణాంకాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం గణాంకాల ఆధారంగా పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాయని తెలిపారు. విద్యార్థులు పాల్గొన్నారు.

మహాయజ్ఞం పరిసమాప్తం

కడప సెవెన్‌రోడ్స్: లోక కల్యాణార్థం కడప బ్రాహ్మణవీధిలోని ఉత్తరాదిమఠంలో నిర్వహించిన దశకోటి కృష్ణమంత్ర జప మహాయాగం, సరస్వతీ మహాయాగం ఆదివారంతో ముగిసింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి, అనంతరం సభా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు సరస్వతి కంకణ ధారణ, పుస్తకాలు, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. మైసూరుకు చెందిన రామచంద్రాచార్, విద్యానిధి ఆచార్, పాండు రంగచార్, శ్రీనిధిచార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

పీర్లచావిడిలో ప్రార్థనలు

కడప ఎడ్యుకేషన్: మొహర్రంను పురస్కరించుకుని కడప పెద్ద దర్గాలో పీర్ల చావిడి వద్ద ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మైనార్టీ నాయకుడు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా పాల్గొని మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా హిందూ ముస్లిలంతా స్నేహభావంతో మొహర్రం జరుపుకొంటారన్నారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రవికుమార్ నిబద్ధత స్ఫూర్తిదాయకం



రవికుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీ ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగోవిందు రవికుమార్ పోరాటాలు ఉద్యోగులందరికీ స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. కడప సబ్ ట్రెజరీ అధికారిగా ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా కలెక్టరేట్ సభా భవన్‌లో ఆదివారం సన్మాన సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల నాయకుల్లో పోరాట పటిమ లోపించిందన్నారు. తమ డిమాండ్ల సాధనకోసం సైతం ప్రభుత్వాలను అడిగే పరిస్థితుల్లో లేకపోవడం విచారకరమన్నారు. ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డ్ అయినప్పటికీ ఆయన సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు రవికుమార్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుదాస్, నాగార్జునరెడ్డి, రాజకుమార్, రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆద మరిస్తే అంతే సంగతులు



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

పులివెందుల రూరల్ : పట్టణంలోని గరండాల్ బ్రిడ్జి నుంచి ఎర్రగుడిపల్లెకు వెళ్లే దారి అధ్వానంగా తయారైంది. పది రోజుల క్రితం కురిసిన వర్షానికి రోడ్డంతా కోతకు గురైంది. అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడింది. ఏమాత్రం ఆదమరిస్తే అంతే సంగతులు. ఈ రోడ్డులో వాహనాలు, ఆటో వాహనాలతోపాటు పాదాచారాలు వెళుతుంటారు. రాత్రి సమయాల్లో ఏమాత్రం ఆద మరిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఏర్పడిన గొయ్యిని పూడ్చాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

శాంతి సమాజ నిర్మాణానికి పాటుపడాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: మేధావులు మౌనం వీడి శాంతి సమాజ నిర్మాణానికి పాటుపడాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, కేంద్ర కమిటీ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సాయంత్రం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ సమసమాజ స్థాపనే ధ్యేయంగా, కులమతాలకు అతీతంగా సాటి మానవునికి తోడ్పాటు అందిస్తోందన్నారు. దుఃఖ సమయంలో ఉన్న వ్యక్తి ప్రతి కన్నీటి బొట్టు ఆపడమే మానవత ధ్యేయమన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. మానవత సంస్థ అధ్యక్షుడిగా గడ్డం సాంబశివారెడ్డి, కార్యదర్శిగా అవ్వారు సుబ్బయ్య, కోశాధికారిగా కాంభోజి గంగా శివసాయి తేజ, ఉపాధ్యక్షుడిగా బోడిచర్ల వెంకట సుబ్బరాయుడు, సంయుక్త కార్యదర్శిగా సమ్మెట సత్యనారాయణ, ఈసీ అవేర్‌నెస్‌గా సానా వెంకట సుబ్బన్న, ఈసీ ఎడ్యుకేషన్‌కు కల్లూరు బాల యల్లారెడ్డి, ఈసీ హెల్త్‌కు ప్రతాప్, ఈసీ ఎమెర్జెన్సీకి కందుల వెంకటసుబ్బారెడ్డి ఎన్నిక కాగా వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

వడివడిగా ...సాగులో హుషారుగా



వరినాట్లు వేస్తున్న కూలీలు

కడప అగ్రికల్చర్: పెన్నానది పరివాహక ప్రాంతాల్లో రైతులు ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తున్నారు. ఖాజీపేట, చెన్నూరు, పాతకడప, సిద్దవటం పెన్నానది పరిసర ప్రాంతాల్లో రైతులు వరినాటే పనులు చేస్తూ కనిపించారు. ముందుగా సాగుచేసిన జనుము తోటలను ట్రాక్టర్లతో దమ్ము చేసి ఆ తర్వాత వరినాట్లు వేస్తున్నారు. రైతులు బిజీబిజీగా కనిపించిన దృశ్యాలివీ..



ఇలా ట్రాక్టర్‌తో దమ్ము చేస్తూ



సాగులో ఉన్న జీలగ



సిద్ధంగా ఉన్న నారుమడి

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



విద్యార్థుల నిరసన

కడప ఎడ్యుకేషన్: హైదరాబాద్ మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై దాడి చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. కడప అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. విద్యార్థి సంఘాల నాయకులు సుబ్బారాయుడు, వలరాజులు మాట్లాడుతూ ప్రత్రిక, మీడియా స్వేచ్ఛను హరిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలు మహా న్యూస్ కార్యాలయంపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు. కార్యాలయం వద్ద వాహనాలు, ఫర్నిచర్ కంప్యూటర్స్ పగలగొట్టి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని, అక్రమాలను ప్రభుత్వానికి, సమాజానికి చేరవేయడంలో మీడియా బాధ్యతగా వ్యవహరిస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన ఫోన్ ట్యాపరింగ్‌పై టీవీ ఛానల్‌లో ప్రచారం చేయదాన్ని తప్పు పడుతూ కార్యాలయంపై దాడులకు దిగడం అన్యాయమన్నారు. దాడులకు దిగిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, శివ, భాస్కర్ పాల్గొన్నారు.